క్లుప్తంగా

కూలిన ఇంటి పైకప్పు


పెంకుటిల్లు పైకప్పు కూలిపోయిన దృశ్యం

రాంబిల్లి : దిమిలిలో ఆదివారం మాదాసు వెంకటేశ్వరరావుకు చెందిన పెంకుటిళ్లు పైకప్పు కూలిపోయింది. ఈ ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆకస్మాత్తుగా పైకప్పు కూలిపోయింది. అయితే పై కప్పు కూలిన సమయంలో ఇంటిలో కుటుంబసభ్యులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సమయంలో కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. ఇంటి పైకప్పు కూలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు. కాగా సర్పంచ్ బంగారు చిలుకు పైకప్పు కూలిన ఇంటిని పరిశీలించారు. ఈ విషయాన్ని ఆయన వీఆర్వో సత్యనారాయణకు తెలియజేశారు.

కీళ్లు, ఎముకలు వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు


అప్పన్నపాలెంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సోమేష్

రాంబిల్లి : కీళ్లు, ఎముకలు సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం తగదని కీళ్లు, ఎముకలు వైద్య నిపుణులు డాక్టర్ టి. సోమేష్ అన్నారు. విశాఖకు చెందిన రమా ఆసుపత్రి ఆధ్వర్యంలో బీసీటీ సంస్థ సహకారంతో ఆదివారం మామిడివాడ, అప్పన్నపాలెం గ్రామాల్లో ఆయన ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో ఆయన 276 మందికి వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా మొదటి ఆదివారం మామిడివాడ గ్రామంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమా ఆస్పత్రి మేనేజర్ కనకయ్య, బీసీటీ సామాజిక కార్యకర్త శిగిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శంఖ ప్రక్షాళనతో శరీర శుద్ధి

కశింకోట : శరీర శుద్ధికి చేసే యోగ క్రియలన్నింటిలో శంఖ ప్రక్షాళనం శ్రేష్టమైనదని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ యోగ శిక్షకుడు రమేష్ అన్నారు. అనకాపల్లి మండలం కోడూరులో జార్జి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శంఖ ప్రక్షాళన క్రియలు నిర్వహించారు. యోగ సాధకుల శరీరాన్ని అమూలాగ్రం శుద్ధి చేయడానికి ఈ క్రియలు జరిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ తోపాటు ఆరోగ్య ధాత్రి చీఫ్ ఫిజీషియన్ సుందర్ పెరుమాళ్లు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరంనాయుడు పాల్గొన్నారు.

వరాహలక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం పలు ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి నూతన చీర అలంకరణ, దీపాలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు సేవించాల్సిందిగా కోరారు.

వైభవంగా పెద్దింటమ్మ ఉత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న వైస్ ఎంపీపీ, పార్టీ నాయకులు

రోలుగుంట: కుసుర్లపూడిలో ఈ నెల 3న ప్రారంభమైన గ్రామ దేవత పెద్దింటమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమం ముగింపు రోజు మంగళవారం వరకూ కొనసాగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

7న వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి పండుగ


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


వాడ్రాపల్లిలోని పారిపల్లెమ్మ అమ్మవారి ఆలయం


పారిపల్లెమ్మ అమ్మవారు

మునగపాక : ఉత్తరాంధ్రకే పేరుగాంచిన వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి పండగను ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ కన్నుంనాయుడు తెలిపారు. ఏటా మార్చి మొదటి వారం ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామస్తుల సహకారంతో పండగను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

7న ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణం

రాంబిల్లి : పంచదార్ల పుణ్యక్షేత్రంలో శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 7న నిర్వహించనున్నారు. ఈ కల్యాణ మహోత్సవ గోడ పత్రికలను ఆదివారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) ఆవిష్కరించారు. కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి ముత్తా సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం


తిమ్మరాజుపేటలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోరుతూ తిమ్మరాజుపేటలో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, పార్టీ నేత ఉమాశంకర్‌లు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. విశాఖ త్వరలో పరిపాలన రాజధానిగా ప్రకటన రాబోతుందని తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలన్నారు.

8, 9 తేదీలలో మండల స్థాయి వాలీబాల్ టోర్నీ

కోటవురట్ల: కైలాసపట్నంలో నూతనంగా నిర్మించిన శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మండల స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8, 9 తేదీలలో మండల స్థాయిలో టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. టోర్నీలో గెలుపొందిన టీమ్స్‌కు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు. టోర్నీలో వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా జరిగేలా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అంపైర్ నిర్ణయమే తుది నిర్ణయమన్నారు. టోర్నీలో పాల్గొనదలచిన టీమ్స్ ముందుగా రూ.300 ప్రవేశ రుసుము చెల్లించి టీమ్ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7013460075, 6300415053 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గౌరమ్మా.. పోయిరావమ్మా..!


కశింకోటలోని గవరపేటలో శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం


గౌరమ్మ ఉత్సవ సందడి


రేలా రేలా రే ప్రదర్శన

- వేడుకగా వెలంపేట గౌరమ్మ నిమజ్జనోత్సవం

కశింకోట : స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఆర్కెస్ట్రా, మేళతాళాలతో గవరపేట, పెదగుమ్మం వద్ద శారదానది వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు గౌరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. బాణసంచా కాల్చారు. అనంతరం గౌరమ్మ విగ్రహానికి నది ఒడ్డున సంప్రదాయంగా పూజలు నిర్వహించి, నదిలో నిమజ్జనం చేశారు. ఈ ఏడాదంతా చల్లగ కాచిన తల్లీ.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా.. అంటూ మొక్కుకున్నారు. శనివారం రాత్రి ఉత్సవం సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. రేలా రేలా రే, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్రకథ, గంధవరం బృందంతో వెంకటరమణమూర్తి పాట ఆలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆరు ఎకరాల్లో జీడితోట దగ్ధం


కాగితలో దగ్ధమవుతున్న తోటను ఆర్పుకుంటున్న రైతులు

నక్కపల్లి : కాగిత గ్రామంలో ఆదివారం సుమారు 6 ఎకరాల్లో జీడితోట దగ్ధమైంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ తోటలో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి తోట దగ్ధమైంది. పూత పిందె దశలో ఉన్న తోట మంటల్లో కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు దేవవరపు సూర్యనారాయణ, దేవవరపు రామారావు, పోతంశెట్టి గోవిందరావు, పోతంశెట్టి సూర్యుడు, పోతంశెట్టి వెంకటరమణ, దేవవరపు రాము, దాడిశెట్టి సంజీవ్, రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ట

మునగపాక : రామారాయుడుపేటలో సోమవారం పరదేశిమాంబ అమ్మవారి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.38 గంటలకు ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

యాదవుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

కశింకోట : యాదవులంతా ఐక్యతతో తమ హక్కుల కోసం పోరాటం చేయాలని యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబూరావు పిలుపునిచ్చారు. మండలంలోని జమాదులపాలెంలో ఆదివారం నిర్వహించిన మండల యాదవ సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతూ యాదవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారించి, పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంచదార్ల సూరిబాబు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంధం రమణ, తదితరులు మాట్లాడారు. అనంతరం మండల సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షునిగా పంచదార్ల వెంకటరమణ, అధ్యక్షునిగా కరక రాజు, ప్రధాన కార్యదర్శిగా సారిపల్లి నానిబాబు, ఉపాధ్యక్షునిగా కుండల చంటి, కార్యదర్శులుగా నమ్మి నరసింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తాండవ ప్రాజెక్టుకు పర్యవేక్షణ కరువు

- ప్రధాన గేట్లు వద్ద చిన్నారుల చేపల వేట
- ప్రమాదకర ప్రాంతాల్లో సందర్శకుల జలకాలాట
- మాయమవుతున్న విద్యుత్ సామగ్రి


సిబ్బంది పర్యవేక్షణ లేని తాండవ ప్రాజెక్టు మెయిన్ గేటు


గాలాలతో చేపలు వేటాడుతున్న విద్యార్థులు


తాండవ ప్రధాన గేట్లు లోపల చేపలు వేటాడుతున్న చిన్నారులు

నాతవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోనే మేజరు ప్రాజెక్టుగా ప్రసిద్ధి గాంచిన తాండవ రిజర్వాయరుకు పర్యవేక్షణ కొరవడింది. దాంతో ఇక్కడ విలువైన విద్యుత్ సామగ్రి చోరీకి గురవుతోంది. పైగా ప్రతి ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చే సందర్శకులకు భద్రత కరువైంది. ఇంతవరకూ తాండవ రిజర్వాయరు చూసేందుకు అక్కడ కాపలాగా ఉండే సిబ్బంది అనుమతితోనే లోపలకు వెళ్లేవారు. ఇటీవల సదరు సిబ్బంది పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. దీంతో తాండవ ప్రాజెక్టుపై అధికారులు పర్యవేక్షణ లేక చిన్నారులు, సందర్శకులు జలాశయంలోకి దిగేస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల నలుమూలల నుంచి ప్రత్యేక వాహనాల్లో సందర్శకులు పెద్ద ఎత్తన వస్తుంటారు. ఇక్కడ నీటిలో జలకాలాటాలు ఆడేందుకు దిగేస్తున్నారు. ఇలా చేయడం ప్రాణాపాయం అని తెలిసినా వెనుకడుగు వేయడం లేదు. దీంతోపాటు తాండవ చమ్మచింత హాస్టల్ విద్యార్థులు ప్రతి ఆదివారం ఇక్కడకు వచ్చి గాలాలతో చేపలు వేటాడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటున్నారు. తాండవ ప్రధాన గేట్లు వద్ద ప్రమాదమని తెలిసినా పట్టించుకోలేదు. ఇటీవల కొంత మంది సందర్శకులు మందలించడంతో చిన్నారులు ప్రధాన గేట్లుపై దూకి పరారయ్యారు. కొంతమంది విద్యార్థులు తాండవ జలాశయం లోపల భాగంలోకి దర్జాగా దిగి గాలాలతో చేపలు వేటాడుతున్నారు. ఆ ప్రదేశంలో ప్రాజెక్టు లోతు 378 అడుగులకుపైగా ఉంది. అక్కడ ప్రమాదవశాత్తు నీటిలో పడితే మనిషి జాడ దొరకడం కష్టమని చెప్పొచ్చు.

అంధకారంలో ప్రాజెక్టు

తాండవ ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోవడంతో రాత్రిళ్లు తాండవ ప్రాజెక్టు చీకటిమయంగా ఉంటోంది. అధికారులు పర్యవేక్షణ లేక గతంలో తరుచూ ప్రమాదాలు, చోరీలు జరిగేవి. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణను వివరణ కోరగా, సిబ్బంది కొరత కారణంగా తాండవ ప్రాజెక్టుపై ఎవ్వరినీ కాపలా పెట్టలేదన్నారు. తాను స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నానన్నారు.

50 మంది యువకులు రక్తదానం

రావికమతం: గ్రామ యువత, తాసుబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టి.అర్జాపురంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, వైస్ ఎంపీపీ మత్స భవానీశంకర్, సర్పంచ్ మడగల అర్జున, కొత్తకోట ఎస్ఐ విభీషణరావు, నాయకుడు ఇల్లపు సన్యాసినాయుడు రక్తదాతలను అభినందించారు. తరచూ రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. రక్తదానం ఎందరికో ప్రాణదానం చేసినట్లవుతుందన్నారు. నిర్వాహకులను అభినందించారు.

అశ్రునయనాలతో వలంటీర్ అంతిమయాత్ర

మునగపాక : వెంకటాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ఏదురి గోవింద్ అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు గోవింద్ అంత్యక్రియలకు తరలివచ్చారు. జోహార్ గోవింద్ అంటూ స్నేహితులు, స్థానికులు అశ్రునయనాలతో నినదించారు. పరవాడ జంక్షన్ నుంచి గోవింద్ మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా బైక్‌ల ర్యాలీతో గ్రామానికి తోడ్కొని వచ్చారు. అనంతరం గోవింద్ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు. అంత్యక్రియలకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలను తనకు కేటాయించిన కుటుంబాలకు అందజేయడంతో పాటు అందరితో స్నేహపూర్వకంగా మెలిగే గోవింద్ మృతితో స్థానికులు కన్నీటిపర్యంతం చెందారు.

పూత దశలో నువ్వు సాగు


పైడంపేటలో నువ్వు పంట

కె.కోటపాడు: మండలంలో నువ్వు పంట పూత దశలో కళకళలాడుతోంది. ఖరీఫ్ వరికోతలు పూర్తయిన పొలాల్లో రబీ పంటగా విస్తారంగా సాగు చేస్తున్నారు. నువ్వు పంటకు నీటి సాంద్రత తక్కువగా ఉన్న పంట దిగుబడి బాగుంటుందని రైతులు తెలుపుతున్నారు. వేసవి దృష్ట్యా ప్రధానంగా ఈ పంటను నీటి లభ్యత ఉన్న వ్యవసాయ బావులు, సాగునీటి చెరువుల సమీపంలో పొలాల వద్ద సాగు చేస్తున్నారు. డి.అగ్రహారం, గుల్లేపల్లి, రామచంద్రపురం, కింతాడ, పింద్రంగి, పోతనవలస, ఆర్లి, చౌడువాడ, ఎ.భీమవరం, పొడుగుపాలెం, పైడంపేట గ్రామా ల్లో 150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో నువ్వులకు మంచి డిమాండ్ ఉండటంతో సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ


పేటలో పరుగు తీస్తున్న ఎడ్లబండి

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా తమ కుటుంబ సభ్యులతో అమ్మవారి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందించారు. రాత్రికి డప్పులు, వాయిద్యాలు, నేల డాన్స్, భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత మధ్యన అమ్మవారి సంబరం సాగింది.

రేపు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్: జి. అగ్రహారంలో పోలిపల్లెమ్మ పండగ మంగళవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ నందారపు మంగమ్మ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నామన్నారు. పోటీల్లో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ. 12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున అందజేస్తామన్నారు. కోలాటం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున ప్రదానం చేస్తామన్నారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు పందెం

వైభవంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం


గుర్రాల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కోలాటాలు, డప్పులు, వాయిద్యాలు నడుమ వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శక్తివేషాలు, నేల వేషాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పందేలను ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, శ్రీనాథు జగ్గారావు, కమిటీ సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలు చూడటానికి మండలం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. వర్తక సంఘం సభ్యులు కొట్ని సత్తిబాబు, పుట్టా బలరామ్, పెచ్చేటి కొండలరావు, పెచ్చేటి నానాజీ, కోట్ని వెంకట శ్రీనువాస్ పాల్గొన్నారు.

డివిజన్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడిగా నాగప్పారావు



నర్సీపట్నం: ఈపీడీసీఎల్ యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ నర్సీపట్నం డివిజన్ అధ్యక్షుడిగా బోడవరం లైన్ ఇన్‌స్పెక్టర్ కుశెట్టి నాగఅప్పారావు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎన్జీహోమ్‌లో యూనియన్ డివిజన్ నాల్గో మహాసభ నిర్వహించారు. ఈ సభలో డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.రవి ఎన్నికయ్యారు. నాగప్పారావును యూనియన్ నాయకులు భాస్కరరావు, వేపాడ సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, బి.ఎం.ఎల్. నాయుడు, రమేష్ అభినందించారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) అడ్వైజర్ కె.భాస్కరరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులను సకాలంలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు.

ఘనంగా అభయాంజనేయుని తీర్థం


పూలదండలు, వడల మాలలతో అలంకరించిన స్వామి విగ్రహం


మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి పూలు, వడలతో దండలు చేసి, అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం, లంకెలపాలెం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బృందాల మహిళలు ప్రదర్శించిన కోలాటాలు ఆహూతులను అలరించాయి. మాజీ సర్పంచ్ కలగా రామునాయుడు, గోవిందల ఆధ్వర్యంలో జరిగిన తీర్థ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు.

రీసర్వేకు దరఖాస్తు చేసుకోండి

మాకవరపాలెం: రీసర్వేలో భూములు సర్వే చేయించలేని రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. 8 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. ఈ గ్రామాల్లో సర్వే చేయించలేని రైతులతోపాటు శాశ్వత భూ హక్కు పత్రాల్లో తప్పులు ఉంటే, అలాంటి రైతులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.